శభాష్ సర్పంచ్ సాబ్

ఒక కెప్టెన్.. మూడు ఫ్రాంచైజీలు.. ఎక్కడికెళ్లినా బొమ్మ సూపర్ హిట్టు! ప్లేఆఫ్స్ అంటే అదేదో తమకు సంబంధం లేనట్టుగా ఉండే ఢిల్లీని 2020లో ఫైనల్‌కు చేర్చినా.. పదేండ్ల విరామం అనంతరం కోల్‌కతాకు టైటిల్ అందించినా.. 11 ఏండ్ల తర్వాత పంజాబ్ కింగ్స్‌ను ప్లేఆఫ్స్‌కు చేర్చడంతో పాటు టైటిల్ ఫేవరెట్లలో ఒకటిగా నిలబెట్టినా అది అతడికే చెల్లింది. అతడే పంజాబ్ కింగ్స్ సారథి శ్రేయాస్ అయ్యర్.

ఐపీఎల్ పుట్టినప్పట్నుంచి (2008) లీగ్‌లో భాగంగా ఉన్న పంజాబ్ కింగ్స్ (గతంలో కింగ్స్ లెవన్ పంజాబ్) గత సీజన్ దాకా నిలకడలేమికి బ్రాండ్ అంబాసిడర్. ఈ లీగ్‌లో ఆ జట్టు మార్చినంత మంది సారథులను మరే జట్టూ మార్చలేదనేది కండ్ల ముందు కనబడుతున్న వాస్తవం. దాదాపు సీజన్‌కు ఒకరు.. ఒక్కోసారి ఇద్దరి (ఇప్పటిదాకా 17 మంది కెప్టెన్లు ఆ జట్టుకు కెప్టెన్లుగా పనిచేశారు) చొప్పున ఆ జట్టు పగ్గాలు చేపట్టినా కింగ్స్ రాతను మార్చలేకపోయారు. టైటిల్ సంగతి దేవుడెరుగు! కనీసం ప్లేఆఫ్స్‌కు వెళ్లిన సందర్భాలూ రెండంటే రెండే. 2008లో మూడో స్థానంతో ముగించిన ఆ జట్టు.. 2014లో టైటిల్ కలను నెరవేర్చుకునేందుకు అవకాశమొచ్చినా తుది మెట్టుపై బోల్తా కొట్టింది. ఆ తర్వాత 11 ఏండ్ల సుదీర్ఘ విరామం అనంతరం మళ్లీ పంజాబ్ ప్లేఆఫ్స్‌లోకి అడుగుపెట్టడమే గాక టైటిల్ ఫేవరెట్లలో ఒకటిగా దూసుకుపోతుంది. అన్నింటికి మించి గతంతో పోల్చితే ఈ సీజన్‌లో ఆ జట్టు ఆటతీరు పూర్తిగా మారింది. పంజాబ్ ఈ స్థాయిలో మారడానికి కారణం సారథి శ్రేయాస్ అయ్యర్. ఆ జట్టు అభిమానులు 'సర్పంచ్ సాబ్'గా పిలుచుకుంటున్న శ్రేయాస్.. హెడ్‌కోచ్ రికీ పాంటింగ్‌తో కలిసి కింగ్స్ గతినీ, గమనాన్నీ పూర్తిగా మార్చేశాడు.

కమ్‌బ్యాక్ హీరో..

గతేడాది బీసీసీఐ ఆగ్రహానికి గురై సెంట్రల్ కాంట్రాక్టు కోల్పోయిన శ్రేయాస్.. ఈ ఏడాది కమ్‌బ్యాక్ ఇచ్చిన తీరు గురించి చెప్పుకోవాల్సిందే. కోల్‌కతాకు దశాబ్దం తర్వాత ఐపీఎల్ ట్రోఫీ అందించినా ఆ జట్టు అతడిని రిటైన్ చేసుకోకవేలానికి వదిలేసింది. ట్రోఫీ గెలిచిన క్రెడిట్ కూడా అతడికి దక్కలేదు. దీనికి తోడు గాయాలు, షార్ట్ పిచ్ బంతులను ఆడటంలో వైఫల్యంతో జట్టులో చోటు కోల్పోయిన అయ్యర్.. చాంపియన్స్ ట్రోఫీకి ముందు స్వదేశంలో ఇంగ్లండ్ సిరీస్‌తో రీఎంట్రీ ఇచ్చాడు. ఈ సిరీస్‌తో పాటు మెగా టోర్నీలో నిలకడగా రాణించి మార్చి నెలలో ఐసీసీ 'ప్లేయర్ ఆఫ్ ది మంత్' అవార్డును సొంతం చేసుకున్నాడు. బోనస్‌గా బీసీసీఐ కాంట్రాక్టునూ తిరిగి పొందాడు. కేకేఆర్ వద్దు పొమ్మన్న శ్రేయాస్‌ను ఈ ఏడాది జరిగిన మెగా వేలంలో పంజాబ్.. రూ. 26.75 కోట్లతో కండ్లకద్దుకుని తీసుకుని తమ కలను నెరవేర్చమని సారథ్య బాధ్యతలు అప్పగించింది. పంజాబ్ తనపై ఉంచిన నమ్మకాన్ని శ్రేయాస్ నూటికి నూరుపాళ్లు నిలబెడుతూ ఆ జట్టును 11 ఏండ్ల తర్వాత ప్లేఆఫ్స్‌కు చేర్చాడు.

నాయకుడిగా నడిపిస్తూ..

నాయకుడంటే జట్టును నడిపించడమే గాక విజయాల్లోనూ తన పాత్రను స్పష్టంగా నిర్వర్తిస్తున్నాడు అయ్యర్. ఈ సీజన్‌లో అతడు 12 ఇన్నింగ్స్‌లలో 48.33 సగటుతో 435 పరుగులు సాధించి పంజాబ్ తరఫున అత్యధిక పరుగులు చేసిన వారిలో రెండో స్థానంలో నిలిచాడు. వ్యక్తిగత రికార్డులను పక్కనబెట్టి మరీ జట్టు కోసం ఓ సెంచరీనీ త్యాగం చేశాడు. ఈ సీజన్‌లో పంజాబ్ ఆడిన తొలి మ్యాచ్‌లో 97* రన్స్ చేసి శతకానికి దగ్గరగా వచ్చినా మరో ఎండ్‌లో శశాంక్ సింగ్ బాదుతుంటే నాన్‌స్ట్రైకర్ ఎండ్‌లో ఉండి అతడిని ప్రోత్సహించాడు. సారథి ఇచ్చిన స్ఫూర్తితో పంజాబ్ బ్యాటర్లూ ఫియర్‌లెస్ అప్రోచ్, అటాకింగ్ బ్యాటింగ్‌తో దుమ్మురేపుతున్నారు. ప్రియాన్ష్, ప్రభ్‌సిమ్రన్, శశాంక్, నెహల్ వంటి కుర్రాళ్ల మెరుపులే ఇందుకు నిదర్శనం.

ఇక కోల్‌కతాతో ముల్లాన్‌పూర్‌లో జరిగిన మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన పంజాబ్ 111 పరుగులకే కుప్పకూలినా తన బౌలర్లపై నమ్మకంతో శ్రేయాస్ తనదైన వ్యూహాలతో మ్యాచ్‌ను కాపాడుకున్నాడు. ఈ సీజన్‌లో అప్పటి దాకా నిరాశపరిచిన యుజ్వేంద్ర చాహల్‌తో వరుస ఓవర్లు వేయించి ఫలితాన్ని రాబట్టాడు. ప్రత్యర్థి జట్ల బ్యాటర్లు క్రీజులో కుదురుకోనీయకుండా బౌలింగ్ మార్పులు చేస్తూ పంజాబ్‌ను విజయవంతంగా నడిపిస్తున్నాడు. మొన్న ముగిసిన రాజస్థాన్‌తో మ్యాచ్‌లో వేలునొప్పితో ఫీల్డింగ్‌కు రాకపోయినా బౌండరీ లైన్ వద్ద అటూఇటూ తిరుగుతూ స్టాండ్ ఇన్ కెప్టెన్ శశాంక్‌కు బంతిబంతికీ సలహాలు అందించాడు. ఇదే ఊపులో శ్రేయాస్.. పంజాబ్ టైటిల్ కల నెరవేరిస్తే భవిష్యత్‌లో టీమ్‌ఇండియా పరిమిత ఓవర్ల జట్టు సారథ్య రేసులోనూ నిలుస్తాడనంలో అతిశయోక్తి లేదు.

అహ్మదాబాద్‌లోనే ఆఖరి పోరు

- ముల్లాన్‌పూర్‌లో క్వాలిఫయర్, ఎలిమినేటర్
- హైదరాబాద్ నుంచి మ్యాచ్‌ల తరలింపు

ఢిల్లీ: ఐపీఎల్-18 సీజన్‌లో నాకౌట్ మ్యాచ్‌ల వేదికలు మారాయి. పాత షెడ్యూల్ ప్రకారం హైదరాబాద్, కోల్‌కతా ప్లేఆఫ్స్ మ్యాచ్‌లకు ఆతిథ్యమివ్వాల్సి ఉండగా.. తాజాగా వాటిని ముల్లాన్‌పూర్ (చండీగఢ్), అహ్మదాబాద్‌కు మార్చారు. అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియం టైటిల్ పోరుకు ఆతిథ్యమివ్వనుంది. ఈ మేరకు బీసీసీఐ మంగళవారం ఒక ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించింది. హైదరాబాద్‌లో జరగాల్సిన క్వాలిఫయర్ 1, ఎలిమినేటర్ మ్యాచ్‌లను మే 29, 30న ముల్లాన్‌పూర్ (చండీగఢ్)లోని న్యూపీసీఏ స్టేడియంలో నిర్వహించనున్నారు. జూన్ 01న క్వాలిఫయర్-2, 03న అహ్మదాబాద్‌లో ఫైనల్ జరుగుతుంది. ఈ సీజన్‌లో సన్‌రైజర్స్ నిరాశజనక ప్రదర్శనతో డీలాపడ్డ హైదరాబాద్ అభిమానులు.. నాకౌట్ మ్యాచ్‌లను అయినా వీక్షిద్దామని భావించినా వారికి నిరాశే ఎదురైంది. వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో దక్షిణ భారతంలో మ్యాచ్‌లను పూర్తిగా ఉత్తర భారతానికి తరలించారు. నాకౌట్ మ్యాచ్‌లతో పాటు సన్‌రైజర్స్, బెంగళూరు మధ్య ఈనెల 23నమ్యాచ్‌నూ లక్నోకు తరలించినట్టు బీసీసీఐ తెలిపింది.

ముంబై జట్టులో రిప్లేస్‌మెంట్స్

ముంబై: ప్లేఆఫ్స్ రేసులో ఉన్న ముంబై ఇండియన్స్.. త్వరలో తమ జట్టును వీడనున్న ముగ్గురు విదేశీ ఆటగాళ్ల స్థానాన్ని భర్తీ చేసింది. ఈనెల 26 తర్వాత ముంబై ఆటగాళ్లు విల్ జాక్స్, రికెల్టన్, కార్బిన్ బోష్ ఆ జట్టును వీడనున్నారు. ఈ నేపథ్యంలో వారి స్థానాలను జానీ బెయిర్ స్టో, రిచర్డ్ గ్లెసన్, చరిత్ అసలంకతో భర్తీ చేయనున్నట్టు ఆ జట్టు తెలిపింది.

రాజస్థాన్ రాయల్‌గా..

ఆఖరి మ్యాచ్‌లో చెన్నైపై ఘన విజయం • రాణించిన వైభవ్, శాంసన్



ఢిల్లీ: ఐపీఎల్-18లో తమ ఆఖరి లీగ్ మ్యాచ్‌ను రాజస్థాన్ రాయల్స్ ఘనంగా ముగించింది. మంగళవారం చెన్నై సూపర్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ఆ జట్టు 6 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. చెన్నై నిర్దేశించిన 188 పరుగుల లక్ష్యాన్ని రాయల్స్ 17.1 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి ఛేదించింది. వైభవ్ సూర్యవంశీ (33 బంతుల్లో 57, 4ఫోర్లు, 4సిక్సులు), శాంసన్ (41), జైస్వాల్ (36) దంచేశారు. మ్యాచ్‌లో టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన చెన్నై.. ఆయుష్ మాత్రె (43), డెవాల్డ్ బ్రెవిస్ (42), శివమ్ దూబె (39) రాణించడంతో 20 ఓవర్లలో 187/8 స్కోరు చేసింది. రాజస్థాన్ బౌలర్లలో ఆకాశ్ మధ్వాల్ (3/29), యుధ్వీర్ సింగ్ (3/47) రాణించారు. ఛేదనను రాజస్థాన్ ధాటిగానే ఆరంభించింది. జైస్వాల్ ఆరంభం నుంచే బౌండరీలు, సిక్సర్లతో విరుచుకుపడ్డా నాలుగో ఓవర్లో అన్షుల్ అతడిని క్లీన్‌బౌల్డ్ చేసి చెన్నైకి తొలి బ్రేక్ ఇచ్చాడు. కానీ అతడి స్థానంలో వచ్చిన సారథి శాంసన్, కుర్రాడు సూర్యవంశీ చెన్నై బౌలర్లను ఆటాడుకున్నారు. ఇద్దరూ రెండో వికెట్‌కు 58 బంతుల్లో 98 పరుగులు జోడించారు. కానీ ఈ ఇద్దరూ నాలుగు బంతుల వ్యవధిలోనే నిష్క్రమించినా..ధృవ్ జురెల్(12 బంతుల్లో 31 నాటౌట్, 2ఫోర్లు, 3సిక్స్‌లు)ధనాధన్ ఇన్నింగ్స్‌తో అదరగొట్టాడు. చెన్నై బౌలర్లను ఉతికి ఆరేస్తూ బౌండరీలతో విరుచుకుపడ్డాడు. హెట్‌మైర్(12 నాటౌట్) జతగా రాజస్థాన్‌కు జురెల్ ఘన విజయాన్ని కట్టబెట్టాడు. అశ్విన్(2/41)కు రెండు వికెట్లు దక్కాయి.

నేడు ముంబై, ఢిల్లీ కీలక మ్యాచ్

ముంబై: ఐపీఎల్-18 ప్లేఆఫ్స్‌లో చేరే నాలుగో జట్టేదో బుధవారం తేలనుంది! గుజరాత్, బెంగళూరు, పంజాబ్ ఇది వరకే ప్లేఆఫ్స్ బెర్తులను ఖాయం చేసుకోగా బుధవారం ముంబైలోని వాంఖడే వేదికగా జరుగబోయే ముంబై, ఢిల్లీ మ్యాచ్‌తో నాలుగో బెర్తుపై స్పష్టత రానుంది. ప్రస్తుతం పాయింట్ల పట్టికలో ముంబై.. 12 మ్యాచ్‌లలో 7 గెలిచి 14 పాయింట్లతో నాలుగో స్థానంలో ఉంది. ఢిల్లీ కూడా అన్నే మ్యాచ్‌లలో ఆరింటిలో గెలిచి 13 పాయింట్లతో ఉంది. సొంత మైదానంలో ముంబై గనక గెలిస్తే.. 16 పాయింట్లతో నేరుగా ప్లేఆఫ్స్ చేరుతుంది. ఢిల్లీ ఎలిమినేట్ (ఎందుకంటే పంజాబ్‌తో ఆఖరి మ్యాచ్‌లో గెలిచినా ఆ జట్టు ఖాతాలో 15 పాయింట్లే ఉంటాయి) అవడం ఖాయం. ఒకవేళ ముంబై ఓడితే ఆ జట్టు ఈనెల 26న పంజాబ్‌తో మ్యాచ్‌లో తప్పనిసరిగా గెలవడంతో పాటు.. ఢిల్లీ తమ తదుపరి మ్యాచ్‌లో ఓడిపోతేనే హార్దిక్ సేనకు నాకౌట్ ఆశలుంటాయి.

టీడీసీఏకు గుర్తింపునివ్వాలి

బీసీసీఐకి వెంకటేశ్వర్‌రెడ్డి డిమాండ్

హైదరాబాద్, ఆట ప్రతినిధి: గ్రామీణ క్రికెటర్ల ప్రయోజనాలే లక్ష్యంగా ఏర్పాటైన తెలంగాణ డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్(టీడీసీఏ)కు గుర్తింపునివ్వాలని అధ్యక్షుడు అల్లీపురం వెంకటేశ్వర్‌రెడ్డి బీసీసీఐని డిమాండ్ చేశారు. జిల్లాలను విస్మరిస్తూ హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్(హెచ్‌సీఏ) హైదరాబాద్‌కే పరిమితమైన నేపథ్యంలో గ్రామీణ క్రికెటర్ల ప్రతిభను వెలుగులోకి తీసుకొచ్చేందుకు టీడీసీఏ అవిరళంగా కృషి చేస్తున్నదని అన్నారు. జిల్లాల్లో వేసవి శిక్షణాశిబిరాలు నిర్వహించే అర్హత హెచ్‌సీఏకు లేదని ఈ సందర్భంగా వెంకటేశ్వర్‌రెడ్డి విమర్శించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ 'తెలంగాణ గ్రామీణ ప్రాంత క్రికెటర్లకు చాలా ఏండ్లుగా అన్యాయం జరుగుతున్నది. హెచ్‌సీఏ..హైదరాబాద్ వరకే పరిమితమవుతూ మిగతా జిల్లాల క్రికెటర్లను పట్టించుకోవడం లేదు. ఇన్నేండ్ల సుదీర్ఘ కాలంలో జిల్లాల నుంచి రంజీలతో పాటు దేశవాళీ టోర్నీల్లో ప్రాతినిధ్యం లేకుండా పోయింది. గ్రామీణ క్రికెటర్ల ప్రయోజనాల కోసం టీడీసీఏ ఏర్పాటైంది. అసోసియేషన్ స్థాపించిన అనతికాలంలోనే టీ20 టోర్నీతో పాటు అమెరికా యూత్ టీమ్‌తో మ్యాచ్‌లు ఏర్పాటు చేశాం' అని ఆయన అన్నారు.

మనిక, మానవ్ ఔట్

- సింగిల్స్ విభాగాల్లో ముగిసిన భారత్ పోరు

దోహా: ప్రతిష్ఠాత్మక టేబుల్ టెన్నిస్ ప్రపంచ చాంపియన్‌షిప్స్‌లో భారత సింగిల్స్ ఆటగాళ్ల పోరాటం ముగిసింది. మహిళల సింగిల్స్‌లో మనిక బాత్రా, దివ్యతో పాటు పురుషుల సింగిల్స్‌లో మానవ్ టక్కర్ రెండో రౌండ్‌కే వెనుదిరిగారు. 48వ ర్యాంకర్ మానవ్ 2-4 (11-13, 3-11, 11-9, 6-11, 11-9, 3-11)తో హరిమోటొ తొమొకజు (జపాన్) చేతిలో పోరాడి ఓడాడు. మ్యాచ్ ఓడినా మానవ్ పోరాటం ఆకట్టుకుంది. కానీ మనిక 0-4 (8-11, 7-11, 5-11, 8-11)తో జి.హెచ్. పార్క్ (దక్షిణ కొరియా) చేతిలో కనీసం పోరాటం లేకుండానే నిష్క్రమించింది. మరో పోరులో దివ్య 1-4 (3-7, 7-11, 6-11, 11-6, 5-11)తో చైనీస్ తైపీ అమ్మాయి చెన్ ఐ చింగ్‌కు తలవంచింది.

మెయిన్ డ్రాకు శ్రీకాంత్

కౌలాలంపూర్: మలేషియా మాస్టర్స్ సూపర్ 500 టోర్నమెంట్‌లో కిదాంబి శ్రీకాంత్ మెయిన్ డ్రాకు అర్హత సాధించాడు. మంగళవారం జరిగిన క్వాలిఫయర్స్ పోటీలలో ఈ ప్రపంచ మాజీ నంబర్‌వన్ షట్లర్ 9-21, 21-12, 21-6తో హువాంగ్ యు కై (చైనీస్ తైపీ)ని ఓడించి మెయిన్ డ్రాకు వచ్చాడు. తొలి రౌండ్ పోటీలలో అతడు చైనాకు చెందిన లు గువాంగ్ జుతో తలపడనున్నాడు.

దిగ్వేశ్‌పై సస్పెన్షన్

లక్నో: లక్నోసూపర్ జెయింట్స్ స్పిన్నర్ దిగ్వేశ్ రాఠిపై మ్యాచ్ సస్పెన్షన్ పడింది. సోమవారం సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరిగిన మ్యాచ్‌లో అభిషేక్‌శర్మతో వాగ్వాదానికి దిగిన దిగ్వేశ్‌పై ఒక మ్యాచ్ వేటుతో పాటు ఫీజులో 50 శాతం కోత విధించారు. అభిషేక్ ఔటైనా వెంటనే తన ట్రేడ్‌మార్క్ 'టిక్ ద నోట్‌బుక్' శైలిలో దిగ్వేశ్ సంజ్ఞ చేస్తూ కవ్వించే ప్రయత్నం చేశాడు. అభిషేక్ ఫీజులో 25శాతం ఫైన్, డీమెరిట్ పాయింట్ వేశారు.

ఎన్టీఆర్-నీల్ సినిమాలో పోలీసాఫీసర్‌గా?

ఎన్టీఆర్ - ప్రశాంత్‌నీల్ కాంబినేషన్‌లో రూపొందుతోన్న పాన్ఇండియా సినిమా 'డ్రాగన్'(వర్కింగ్ టైటిల్)లో విద్యాబాలన్ కీలక పాత్ర పోషించనున్నదట. ప్రస్తుతం ఈ వార్త ఫిల్మ్ సర్కిల్స్‌లో బలంగా వినిపిస్తున్నది. ఈ కథలో పవర్‌ఫుల్ లేడీ పోలీస్ ఉన్నతాధికారి పాత్ర కీలకమట. ఆ పాత్ర కోసమే విద్యాబాలన్‌ని తీసుకున్నారట దర్శకుడు ప్రశాంత్ నీల్. సహజంగానే ప్రశాంత్‌నీల్ సినిమాల్లోని పాత్రలు చాలా శక్తివంతంగా ఉంటాయి. మరి విద్యాబాలన్ పాత్రను ఆయన ఎలా డిజైన్ చేశారో? అనేది ఇప్పుడు ఫిల్మ్ వర్గాల్లో బలంగా వినిపిస్తున్న ప్రశ్న. ఎన్టీఆర్ కెరీర్‌లోని అత్యుత్తమ చిత్రాల్లో ఒకటిగా నిలిపేలా 'డ్రాగన్' సినిమాను ప్రశాంత్‌నీల్ తెరకెక్కిస్తున్నారని నిర్మాతలు చెబుతున్నారు. మైత్రీ మూవీ మేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ కలిసి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్న విషయం తెలిసిందే.

చిత్రం

నా కళ్లు నిన్నెప్పట్నుంచో వెంటాడుతున్నాయ్ కబీర్..

అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న 'వార్ 2' టీజర్ రానేవచ్చింది. మే 20 ఎన్టీఆర్ పుట్టినరోజు సందర్భంగా మేకర్స్ టీజర్‌ని విడుదల చేశారు. నాలుగురోజుల క్రితం 'వార్ 2' హీరోల్లో ఒకరైన హృతిక్ రోషన్ మే 20న అద్భుతమైన అప్‌డేట్ ఉంటుందని తన ఎక్స్(ట్విటర్) ద్వారా ప్రకటించిన విషయం తెలిసిందే. మంగళవారం విడుదలైన ఈ టీజర్ గురించే నాలుగురోజుల క్రితం ఆయన ఆ పోస్ట్ పెట్టారని అవగతమవుతోంది. హిందీతోపాటు తెలుగు, తమిళ భాషల్లో కూడా ఈ టీజర్ విడుదలైంది. ఇందులో డైలాగులు, విజువల్స్, యాక్షన్ సీక్వెన్స్ ప్రేక్షకుల్ని సంభ్రమాశ్చర్యానికి గురిచేశాయని చెప్పొచ్చు. 'నా కళ్లు నిన్ను ఎప్పటి నుంచో వెంటాడుతున్నాయి కబీర్.. ఇండియాలో బెస్ట్ సోల్జర్.. రా లో బెస్ట్ ఏజెంట్.. నువ్వే.. కానీ ఇప్పుడు కాదు.. నీకు నా గురించి తెలీదు.. ఇప్పుడు తెలుసుకుంటావ్.. గెట్ రెడీ ఫర్ వార్..' అంటూ ఎన్టీఆర్ చెప్పే డైలాగ్స్ టీజర్‌కు హైలైట్‌గా నిలిచాయి. హృతిక్‌కీ, ఎన్టీఆర్‌కీ మధ్య ఢీ అంటే ఢీ అనేలా ఇందులో పోరాటాలుంటాయని టీజర్ చెబుతున్నది. హృతిక్‌రోషన్, ఎన్టీఆర్ స్క్రీన్ ప్రజెన్స్‌తోపాటు ఇద్దరు కలిసి చేసిన పోరాటాలు మాస్ ప్రేక్షకుల్ని అలరిస్తాయని, సాంకేతిక విలువలు కూడా హాలీవుడ్ స్థాయిలో ఉంటాయని మేకర్స్ చెబుతున్నారు. యష్‌రాజ్ స్పై యూనివర్స్ ఫ్రాంచైజీలో భాగంగా తెరకెక్కుతున్న ఈ యాక్షన్ అడ్వెంచర్ మూవీలో కైరా అద్వానీ కథానాయికగా నటిస్తున్న విషయం తెలిసిందే. అయాన్ ముఖర్జీ దర్శకత్వంలో రూపొందుతోన్న ఈ పాన్ ఇండియా చిత్రం ఆగస్ట్ 14న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.

దాచిన నిజం శాశ్వతంగా దాగుండదు..

మంచు మనోజ్ కథానాయకుడిగా 'రక్షక్' పేరుతో ఓ చిత్రం తెరకెక్కుతున్నది. ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్‌గా తెరకెక్కుతున్న ఈ చిత్రానికి నవీన్ కొల్లి దర్శకుడు. శ్రీనిధి క్రియేషన్స్ పతాకంపై సినిమా రూపొందుతున్నది. మంగళవారం మంచు మనోజ్ పుట్టినరోజు సందర్భంగా ఈ సినిమా టైటిల్‌ని మేకర్స్ ప్రకటించారు. ఈ సందర్భంగా ఓ పోస్టర్‌ని కూడా విడుదల చేశారు. ఇన్నోవేటివ్‌గా, ఇంటెన్స్‌గా పవర్‌ఫుల్ లుక్‌తో మనోజ్ ఈ పోస్టర్‌లో కనిపిస్తున్నారు. పోస్టర్‌పై కనిపిస్తున్న The hidden truth is never hidden forever (దాచిన నిజం శాశ్వతంగా దాగి ఉండదు) అనే ట్యాగ్‌లైన్ కథలోని మిస్టరీని సూచిస్తున్నది. ఇందులో ఆవేశపరుడైన పోలీస్ పాత్రలో మంచు మనోజ్ కనిపించనున్నారని, ఆయన కెరీర్‌లో బెస్ట్ క్యారెక్టర్ ఇదే అవుతుందని, థ్రిల్లింగ్ క్రైమ్ డ్రామాగా రూపొందుతున్న ఈ సినిమా ప్రేక్షకులకు ఎడ్జ్ ఆఫ్ ది సీట్ ఎక్స్‌పీరియన్స్ ఇస్తుందని, ఈ సినిమాకు సంబంధించిన మరిన్ని వివరాలు త్వరలో తెలియజేస్తామని మేకర్స్ చెప్పారు. మంచు మనోజ్ నటించిన 'భైరవం' చిత్రం ఈ నెల 30న విడుదల కానుంది. 'మిరాయి' ప్రస్తుతం నిర్మాణ దశలో ఉంది.

ప్రయోగాత్మక కథను ఆదరించారు



''23' చిత్రానికి మంచి ఆదరణ లభిస్తున్నది. ఈ తరహా కథతో సినిమా తీయడం నిజంగా ఓ ఛాలెంజ్. ఈ సినిమా స్ఫూర్తితో ఇలాంటి కథలు మరిన్ని రావాలన్నదే నా ఆకాంక్ష' అని అన్నారు దర్శకుడు రాజ్.ఆర్. ఆయన నిర్దేశకత్వంలో తేజ, తన్మయి ప్రధాన పాత్రల్లో నటించిన '23' చిత్రం ఇటీవలే ప్రేక్షకుల ముందుకొచ్చింది. మంగళవారం సక్సెస్‌మీట్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడిన దర్శకుడు రాజ్ ఆర్ ఈ కథకు ప్రేక్షకుల అంగీకారం లభించడం ఆనందంగా ఉందన్నారు. నటీనటులందరూ అద్భుతంగా పర్‌ఫార్మ్ చేశారని, సినిమా తమ నమ్మకాన్ని నిలబెట్టిందని చెప్పారు. తొలి సినిమాకే ఇలాంటి పర్‌ఫార్మెన్స్ స్కోప్ ఉన్న పాత్ర దొరకడం అదృష్టంగా భావిస్తున్నానని, సినిమాకు మంచి రివ్యూస్ వచ్చాయని కథానాయిక తన్మయి చెప్పింది. హీరో తేజ మాట్లాడుతూ 'ఇలాంటి ఇంటెన్స్ స్టోరీతో నటుడిగా పరిచయం కావడం అదృష్టంగా భావిస్తున్నా. పదేళ్ల తర్వాత చేయాల్సిన పాత్ర ఇది. నాపై నమ్మకంతో దర్శకుడు రాజ్ ఆర్ ఈ క్యారెక్టర్ ఇచ్చారు. ఆయన్ని జీవితాంతం గుర్తుపెట్టుకుంటాను' అన్నారు. ఈ కార్యక్రమంలో చిత్ర యూనిట్ సభ్యులందరూ పాల్గొన్నారు.

తుఫాన్‌ని ఏ పిడుగూ ఆపలేదు!

రెండుగంటల పాటు వినోదాన్ని పంచేందుకు కొన్ని నెలల పాటు చమటోడ్చుస్తారు సినిమావాళ్లు. ఈ క్రమంలో ఒక్కోసారి ప్రాణాల మీదకు కూడా తెచ్చుకుంటారు. అందుకే వారి కష్టాన్ని తక్కువచేసి చూడలేం. రీసెంట్‌గా ఢిల్లీ భామ రాశీఖన్నా ఓ షూటింగ్‌లో గాయలపాలైంది. ఈ విషయాన్ని తెలియజేస్తూ తన సోషల్ మీడియాలో ఫొటోలను కూడా షేర్ చేసింది. ఈ ఫొటోల్లో ఆమె చేతికీ, ముఖానికి చిన్న చిన్న దెబ్బలు కనిపిస్తున్నాయి. 'కథ డిమాండ్ చేస్తే.. గాయాలను కూడా లెక్క చేయకూడదు.. మనమే ఒక తుఫాన్ అయినప్పుడు, మనల్ని ఏ పిడుగూ ఆపలేదు..' అంటూ ఫొటోలతో పాటు ఓ క్యాప్షన్‌ని కూడా జతచేసింది రాశీఖన్నా. ప్రస్తుతం ఈ పోస్ట్ సోషల్ మీడియాలో బాగా వైరల్ అవతున్నది. ఈ ముద్దుగుమ్మ షాహిద్‌కపూర్‌తో కలిసి నటించిన వెబ్ సిరీస్ 'ఫర్జీ'. విజయ్ సేతుపతి కీలక పాత్ర పోషించిన ఈ వెబ్ సిరీస్ ఓటీటీలో పెద్ద హిట్‌గా నిలిచింది. ప్రస్తుతం ఈ సిరీస్‌కి సంబంధించిన సీజన్2 షూటింగ్ మొదలైనట్టు సమాచారం. ఆ షూటింగ్‌లోనే రాశీఖన్నాకు గాయాలయ్యాయని తెలుస్తున్నది.

వీరమల్లుకి కీరవాణి ప్రాణం పోశారు

''హరిహర వీరమల్లు' చిత్రానికి కీరవాణి అందించిన సంగీతం కథలోని భావోద్వేగాలను శిఖర స్థాయికి తీసుకెళ్లింది. తన స్వరాలతో వీరమల్లుకి ప్రాణం పోశారనటం ఏమాత్రం అతిశయోక్తి కాదు' అన్నారు అగ్ర హీరో పవన్‌కల్యాణ్. ఆయన కథానాయకుడిగా నటించిన 'హరిహరవీరమల్లు' చిత్రం జూన్ 12న ప్రేక్షకుల ముందుకురానుంది. జ్యోతికృష్ణ దర్శకుడు. ఈ సినిమాలోని 'సలసల మరిగే నీలోని రక్తమే..'అనే పాటను కీరవాణి స్వరపరచడంతో పాటు సాహిత్యాన్ని కూడా అందించారు. ఈ గీతం నేడు విడుదలకానుంది. ఈ సందర్భంగా మంగళవారం పవన్‌కల్యాణ్, కీరవాణి కలుసుకొని సంగీతం, సాహిత్యాలకు సంబంధించిన అంశాలపై తమ అభిప్రాయాల్ని పంచుకున్నారు. మనలోని పౌరుషం, వీరత్వం ఎన్నటికీ చల్లబడిపోకూడదని ప్రతి ఒక్కరినీ కార్యోన్ముఖుల్ని చేస్తూ కీరవాణి అద్భుతంగా గీతరచన చేశారని పవన్‌కల్యాణ్ కొనియాడారు. కీరవాణి తన సంగీతప్రస్థానం గురించి చెబుతుంటే సమయం తెలియలేదని, కీరవాణి సరిగమలతో బాణీలు కూర్చే కూర్పరి మాత్రమే కాదు, చక్కటి తెలుగు పదాలతో గీతాలు అల్లగల నేర్పరి కూడా అని పవన్‌కల్యాణ్ ప్రశంసించారు. తెలుగు కథల్ని ప్రేమించే కీరవాణి తాను మెచ్చిన 32 కథలను ఓ సంకలనంగా తీసుకొచ్చి తనకు బహూకరించడం ఆనందంగా ఉందని, ఇందులో ఆయన రాసిన రెండు కథలున్నాయని చెప్పారు. సినిమా కోసం కీరవాణి ఎంతగానో తపిస్తారని, సృజనాత్మక స్వరాలతో మైమరపిస్తూ తెలుగు పాటను ఆస్కార్ వేదికపైకి తీసుకెళ్లారని పవన్‌కల్యాణ్ అన్నారు.

'మాయాబజార్' మళ్లొస్తున్నది!



తెలుగు సినీచరిత్రలో 'మాయాబజార్' చిత్రం ఎవర్‌గ్రీన్ క్లాసిక్‌గా నిలిచిపోయింది. కెవీ రెడ్డి నిర్దేశకత్వంలో ఎన్టీరామారావు, నాగేశ్వరరావు, ఎస్వీ రంగారావు, సావిత్రి, రేలంగి, గుమ్మడి, సూర్యకాంతం వంటి ప్రజ్ఞావంతులైన తారాగణంతో వెండితెరపై ఓ దృశ్యకావ్యంగా నిలిచిపోయింది. ఈ నెల 28న ఎన్టీ రామారావు 102వ జయంతి సందర్భంగా ఈ చిత్రాన్ని సరికొత్త సాంకేతిక హంగులతో ముస్తాబు చేసి రీరిలీజ్ చేస్తున్నారు. బలుసు రామారావు ఈ రీరిలీజ్ వెర్షన్‌ను సిద్ధం చేశారు. ఈ సందర్భంగా సోమవారం ఓ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. దీనికి ముఖ్య అతిథులుగా ఎన్టీఆర్ లిటరేచర్ కమిటీ ఛైర్మన్ టీడీ జనార్దన్, రమేష్‌ప్రసాద్, యస్వీ కృష్ణారెడ్డి, వీరశంకర్, అచ్చిరెడ్డి తదితరులు హాజరయ్యారు. 68 ఏళ్ల క్రితం విడుదలైన 'మాయాబజార్' నేటి తరాన్ని కూడా అలరిస్తుందని, గ్రాఫిక్స్‌లేని నాటి రోజుల్లోనే అద్భుతంగా తెరకెక్కించారని టీడీ జనార్దన్ అన్నారు. ఈ చిత్రాన్ని ఐమాక్స్ బిగ్‌స్క్రీన్‌లో విడుదల చేయడం ఆనందంగా ఉందని రమేష్ ప్రసాద్ తెలిపారు. 'మాయాబజార్' చిత్రాన్ని ఎన్నిసార్లు చూసినా తనివి తీరదని యస్వీకృష్ణారెడ్డి పేర్కొన్నారు

చారిత్రక గుహల్లో సాహసాలు

'హను-మాన్'ఫేం తేజా సజ్జా సూపర్ యోధాగా నటిస్తున్న పాన్ ఇండియా యాక్షన్ అడ్వెంచర్ డ్రామా 'మిరాయ్'. కార్తీక్ ఘట్టమనేని ఛాయాగ్రహణం అందిస్తూ, స్వీయ దర్శకత్వంలో ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్న ఈ చిత్రం ఆగస్ట్‌లో విడుదల కానుంది. తాజాగా ఈ సినిమా కొత్త షెడ్యూల్ ముంబయ్‌లోని చారిత్రక గుహల్లో ప్రారంభమైంది. తేజ సజ్జాతోపాటు కొన్ని ప్రధాన పాత్రలు ఈ షెడ్యూల్‌లో పాల్గొంటున్నాయి. ప్రపంచవ్యాప్తంగా 8 భాషల్లో 2డీ, 3డీ ఫార్మాట్‌లో సినిమాను గ్రాండ్‌గా విడుదల చేస్తామని నిర్మాత టీజీ విశ్వప్రసాద్ తెలిపారు. మంచు మనోజ్ విలన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో రీతికా నాయక్ కథానాయిక. ఈ చిత్రానికి రచన: మణిబాబు కరణం, సంగీతం: గౌరహరి, సహ నిర్మాత: వివేక్ కూచిభొట్ల.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.